# సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 12 । జూలై । 2023






## పులుల సంచారంపై 'నిఘా' 10లో▸

తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి పెన్‌గంగ దాటి జిల్లాకు వచ్చే పులుల సంచారంపై అటవీశాఖ నిఘా పెంచింది. నది పరీవాహక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది.

## కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు

కైలాస్‌నగర్: భారీ వర్షాల నేపథ్యంలో ఏమైన సమస్యలు ఎదురైతే తక్షణ సాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్–18004251939ను సంప్రదించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో (రెయిన్‌ఫాల్) కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా యంత్రాంగం పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
29.0/24.0

## వాతావరణం

వాతావరణం మేఘావృతమై ఉంటుంది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### 'బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు'



మాట్లాడుతున్న శివసేనారెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: గత ఎన్నికల హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని యూత్ కాంగ్రెస్ రాష్ట్రఅధ్యక్షుడు శివసేనారెడ్డి అన్నారు. తెలంగాణ యూత్‌కాంగ్రెస్ యువ పోరాట యాత్ర మంగళవారం జిల్లాకు చేరుకుంది. ముందుగా ఆయనను మావల సమీపంలోని జాతీయ రహదారి 44 వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి మోటార్ సైకిల్ ర్యాలీగా పట్టణానికి చేరుకున్న ఆయన కుమురం భీం చౌరస్తాలో కుమురంభీం, అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఓల్డ్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, నాయకులు కంది శ్రీనివాసరెడ్డి, సంజీవ్‌రెడ్డి, నరేష్‌జాదవ్, నగేష్, శ్రీధర్, తదితరులు ఉన్నారు.

### 15 మంది పోలీసులకు 'సేవా' పతకాలు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వం పోలీసు అధికారులకు సేవా పతకాలను మంగళవారం ప్రకటించింది. జిల్లాలో 15 మంది ఎంపికయ్యారు. వీరిలో ఒకరికి ఉత్తమ సేవా పతకం, 14 మందికి సేవా పతకం వరించింది. ఉత్తమ సేవా పతకానికి గాను రూ.30 వేలు, సేవా పతకానికి రూ.20 వేలు నగదు పురస్కారం అందుకోనున్నారు. ఉత్తమ సేవా పతకానికి ఆదిలాబాద్ ఏఆర్‌ఎస్సై ఎ.ఆశన్న ఎంపికయ్యారు. సేవా పతకానికి గాను డీసీఆర్బీ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, టూటౌన్ ఎస్సై ఎం. ఊషన్న, ఆర్‌ఎస్సై మారుతి, డీసీఆర్బీ ఎస్సై కలీం, ఆర్‌ఎస్సై గంబీర్‌సింగ్, మహిళా ఏఎస్సై సునీత, ఏఆర్‌ఎస్సై ఎం. ప్రకాశ్, మహిళా పీఎస్ ఏఎస్సై కవిత, డీసీఆర్బీ హెడ్ కానిస్టేబుల్ ప్రేమ్‌సింగ్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, మహిళా పీఎస్ కానిస్టేబుల్ అసదుల్లాఖాన్, ఏఆర్ కానిస్టేబుల్ జగదీశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ ట్రాఫిక్ హెచ్‌సీ శ్యామ్‌రావు, మావల పోలీస్ స్టేషన్ హెచ్‌సీ ప్రభాకర్ ఎంపికయ్యారు.

### 'రైతులపై కాంగ్రెస్ కక్షసాధింపు'

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ రైతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు 3 గంటల విద్యుత్ ఇస్తే సరిపోతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇందులో పార్టీ నాయకులు రమేష్, ప్రహ్లాద్, గంగారెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

### జనాభా నియంత్రణకు కృషి చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవం పురస్కరించుకొని డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, ప్రోగ్రాం అధికారి విజయసారధి, వైద్య సిబ్బంది ఉన్నారు.

**పోస్టర్ మేకింగ్ పోటీలు**

జనాభా నియంత్రణ దినోత్సవం పురస్కరించుకొని విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి డీఈవో ప్రణీత అతిథిగా హాజరయ్యారు. ఆయా పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు జనాభా నియంత్రణకు సంబంధించి చిత్రాలు గీశారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు డీఈవో బహుమతులు ప్రదానం చేశారు.

### 'సమగ్ర శిక్ష'లో పోస్టుల భర్తీ

ఆదిలాబాద్‌టౌన్: సమగ్ర శిక్ష అభియాన్‌లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియ మంగళవారం ముగిసింది. అభ్యర్థుల ర్యాంక్, మెరిట్, రోస్టర్ ప్రాతిపదికన డీఈవో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ కల్పించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ ప్రోగ్రామర్ 1, డాటా ఎంట్రీ ఆపరేటర్ 1, మండల కేంద్రాల్లో 4 ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, 5 డాటాఎంట్రీ ఆపరేటర్లు, 9 ఐఈఆర్టీ పోస్టులను భర్తీ చేసినట్లు డీఈఓ ప్రణీత తెలిపారు.

# ఇంటి పోరు!

- ఎన్నికలకు ముందు ప్రధాన పార్టీల నేతల మధ్య లొల్లి
- బీఆర్‌ఎస్‌లో తాడోపేడో అంటున్న ఎమ్మెల్యేలు జోగు, బాపూరావు
- కాంగ్రెస్‌లో కొత్త, పాత నేతల నడుమ విభేదాలు
- బీజేపీలో ఇప్పటికే ఎంపీ వర్సెస్ ముఖ్యనేతలు
- జిల్లాలో హీటెక్కిన రాజకీయం



జోగు రామన్న



రాథోడ్ బాపూరావు



సోయం బాపూరావు



రాథోడ్ రమేశ్



పాయల్ శంకర్



సాజిద్ ఖాన్



గండ్రత్ సుజాత



కంది శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి,ఆదిలాబాద్: ఎన్నికలకు ముందు ప్రధాన పార్టీల్లో ఇంటి పోరు నెలకొంది. ఇతర పార్టీలు, నేతలపై ఆరోపణల కంటే సొంత పార్టీలోనే కుమ్ములాటలు తీవ్రమయ్యాయి. దీనికి వేర్వేరు కారణాలు ఉన్నాయి. నియోజకవర్గంలో టికెట్ సాధించేందుకు పై చెయ్యి ఉండేలా ప్రయత్నాలు.. వేర్వేరు నియోజకవర్గాలైనప్పటికీ భవిష్యత్తు రాజకీయాల్లో ప్రాబల్యం చాటుకునే యత్నాలు మొత్తంగా బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లో ఈ విభేదాలు రాజకీయాన్ని హీటెక్కించాయి.

**బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్యేల లొల్లి..**

బీఆర్‌ఎస్‌లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న వర్సెస్ బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మధ్య విభేదాలు ముదిరి పాకాన పడ్డాయి. బోథ్ మండలం నుంచి సొనాల ప్రత్యేక మండలం ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయిన తర్వాత నేతలు తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే జోగురామన్న, మాజీ ఎంపీ నగేష్, జెడ్పీటీసీలు అనిల్‌జాదవ్, రాజు, సుధాకర్ పాల్గొన్నారు. తన నియోజకవర్గంలో కనీ సం తనని పిలవకుండా ర్యాలీ, సభ నిర్వహించడం, అందులో జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పాల్గొనడాన్ని బోథ్ ఎమ్మెల్యే బాపురావు విభేదిస్తున్నారు. అంతేకాకుండా సొనాల మండలం ఏర్పాటులో తాను అనేకసార్లు ముఖ్యమంత్రికి నివేదించడం జరిగిందని, ఎమ్మెల్యే ప్రమేయం లేకుండా మండలం ఏర్పాటు అవుతుందా అని ఆయన ప్రశ్నిస్తున్నారు. పార్టీలో సమతూకం పాటించాల్సి ఉండగా, తనను ఒంటరి చేసే యత్నాల్లో భాగంగానే జిల్లాలో ఇదంతా జరుగుతుందని ఆయన జోగు రామన్నపై అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. అయితే మంగళవారం జోగు రామన్న, డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిశారు. సొనాల మండలం ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఒకవైపు ఫిర్యాదు వ్యవహారం రాజకీయంగా హీటెక్కిస్తుండగా, మరోవైపు ఈ ముఖ్య నాయకులు కేటీఆర్‌ను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పార్టీలో ఏం జరుగుతుందో సామాన్య కార్యకర్తలకు అయోమయంగా ఉంది.

**హస్తంలో ఎవరి గడప వారిదే..**

కాంగ్రెస్‌లో పాత నేతలు సాజిద్‌ఖాన్, గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవ్ రెడ్డిలు ఏకమై పార్టీ పరంగా గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఆదిలాబాద్ నియోజకవర్గంలో విస్తృతంగా నిర్వహిస్తున్నారు. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కంది శ్రీనివాస్ తాను ప్రత్యేకంగా నియోజకవర్గంలో తిరుగుతూ గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ఇప్పటికే కొత్త, పాత నేతల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు ఉన్నాయి. ప్యారాషూట్ నేతలకు టికెట్ ఇవ్వొద్దని పాత నేతలు మాజీ మంత్రి సి.రాంచంద్రారెడ్డి ద్వారా అధిష్టానాన్ని కోరారు. ఈ పరిణామాలు కాంగ్రెస్‌లో నేతల మధ్య విభేదాలు స్పష్టం చేస్తున్నాయి.

**బీజేపీలో ముఖ్య నేతల మధ్య..**

బీజేపీ ఎంపీ సోయం బాపూరావుకు జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌తో పార్టీలో పొసగడం లేదు. ఎంపీ ల్యాడ్స్ విషయంలో పార్టీకి చెందిన స్థానిక సంస్థల నాయకులతో సోయం బాపూరావు చేసిన వ్యాఖ్యలకు సంబంధించి సమావేశం జరిగిన కొద్ది రోజుల తర్వాత ఆ వీడియోను వ్యూహాత్మకంగా బయటకు తీసుకురావడం ద్వారా తనను బద్నాం చేయాలని యత్నిస్తున్నారని పాయల్ శంకర్, రాథోడ్ రమేశ్‌పై సోయం వ్యాఖ్యలు చేయడం దుమారం లేపాయి. ఈ వ్యవహారం తర్వాత గత కొద్ది రోజులుగా ఎంపీ సోయం బాపూరావు ఢిల్లీ, హైదరాబాద్, వరంగల్ టూర్లలో ఉండడంతో ప్రస్తుతం వ్యవహారం సైలెంట్‌గానే ఉంది. అయితే ఎన్నికలకు ముందు సొంత పార్టీలోనే నేతల మధ్య ఈ విభేదాలు పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తాయన్న ఆందోళన కార్యకర్తల్లో నెలకొంది.

## 'ముత్నూర్'ను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామాన్ని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జాతీయ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 అవార్డుకు ఈ గ్రామం ఎంపిక కావడంతో మండల, పంచాయతీ అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటింటా తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి, కంపోస్టు ఎరువు తయారు చేయాలని సూచించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు హరితహారంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్నిపూర్తిగా నిషేధించాలన్నారు. అనంతరం కలెక్టర్ గ్రామంలో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, కూడళ్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, సర్పంచ్ బాగుబాయి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

కైలాస్‌నగర్: పెండింగ్ బిల్లుల విడుదలతో పాటు జీవోనంబర్ 8 ప్రకారం పెంచిన వేతనాలు ఏరియర్స్‌తో సహా చెల్లించాలనే డిమాండ్‌తో మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.2వేల వేతనం పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ 2022 మార్చి 15న అసెంబ్లీలో ప్రకటించారన్నారు. అయితే ఇప్పటి వరకు అమలు చేయడం లేదన్నారు. వెంటనే ఏరియర్స్‌తో సహా చెల్లించేలా బడ్జెట్ కేటాయించాలన్నారు. మరోవైపు ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కుంటాల రాములు, చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మెస్రం భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు సహకరించాలని కోరారు. ఇందులో నాయకులు లక్ష్మణ్, సురేందర్, సతీష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# 'మత్స్య' టెండర్లు ఖరారు

- చేప సీడ్ సరఫరాకు సన్నద్ధం
- క్షేత్ర పరిశీలనపై అధికారుల దృష్టి
- ఈ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి
- ఆగస్టు మొదటి వారంలో చెరువుల్లో వదిలేలా ప్రణాళిక

| జిల్లాలో.. |
| --- |
| మొత్తం చెరువులు : 236 |
| ప్రాజెక్టులు : 4 |
| మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు : 78 |
| సహకార సంఘాల్లోని సభ్యులు : 4300 |



కైలాస్‌నగర్: జిల్లాలో 2023–24 సంవత్సరానికి గాను ఉచిత చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. చెరువులు, ప్రాజెక్టుల్లో వదిలేందుకు అవసరమైన సీడ్ సరఫరాకు సంబంధించి మూడుసార్లు టెండర్లు ఆహ్వానించగా ఎట్టకేలకు ఖరారయ్యాయి. నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేశారు. దీంతో వారికి సంబంధించిన చేపల సీడ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. వారంలోగా పరిశీలన చేపట్టి జిల్లాకు అవసరమైన సీడ్‌ను వారు సప్లై చేయగలుగుతారా, చేపల చెరువులు ఉన్నాయా అనే వివరాలను నిర్ధారించనున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే తుది దశ టెండర్లను నెలాఖరులోపు పూర్తిచేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసినట్‌లైతే ఆగస్టు మొదటి వారం నుంచి చెరువులు, ప్రాజెక్టుల్లో చేప పిల్లలను వదలనున్నారు.

**ఎట్టకేలకు ఖరారు**

చేపల సీడ్ సరఫరా కోసం యంత్రాంగం గత నెలలో రెండుసార్లు టెండర్లను ఆహ్వానించింది. గతేడాది చిన్న సైజ్ పిల్లలకు 63 పైసలు, పెద్ద సైజ్ వాటికి రూ.1.60 చొప్పున టెండర్లు స్వీకరించిన ప్రభుత్వం ఈ ఏడాది వాటి ధర తగ్గించింది. ప్రస్తుతం చిన్న సైజు వాటికి 51పైసలు, పెద్ద సైజు చేపపిల్లలకు రూ.1.50 చొప్పున ఖరారు చేసింది. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించారు. తొలిసారి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో వాటి ధర కొంత పెంచారు. చిన్న సైజ్ వాటికి 56పైసలు, పెద్ద సైజ్ వాటికి రూ.1.53పైసలకు పెంచి మరోసారి పిలిచారు. అయితే రెండు సార్లు టెండర్లను పిలిచినా సీడ్ ధర తమకు అనుకూలంగా లేవనే కారణంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. తాజాగా ఈ నెలలో మూడోసారి ఆహ్వానించగా నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు టెండర్లు దాఖలు చేశారు. సోన్ మండలానికి చెందిన ధనలక్ష్మి ఫిష్ సీడ్ ఫాం, పాక్‌పట్ల గ్రామానికి చెందిన బోయ మత్తేశ్వర్ టెండర్ వేశారు. కేవలం రెండు మాత్రమే దాఖలు కావడాన్ని పరిశీలిస్తే కాంట్రాక్టర్లు రింగైనట్లుగా అర్థమవుతుంది. క్షేత్రస్థాయిలో వీరికి సంబంధించి చేపల సీడ్, చెరువులు, వాటి రిజిస్ట్రేషన్ వంటి వివరాలను పరిశీలించనున్నారు. సీడ్ పంపిణీకి అన్ని అర్హతలు కలిగి ఉన్నట్లు తేలితే తుది దశ టెండర్లను ఖరారు చేస్తారు. అయితే గతంలో రెవెన్యూ, వెటర్నరీ, మత్స్యశాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన జరిపేవారు. అయితే ఈ ఏడాది కేవలం మత్స్యశాఖ అధికారులే పరిశీలన చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**1.23 కోట్ల చేప పిల్లలు**

కుల వృత్తిపై ఆధారపడి జీవించే మత్స్యకారులకు జీవనోపాధితో పాటు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. జిల్లాలోని 236 చెరువులు, నాలుగు ప్రాజెక్టుల్లో కలిపి ఈ ఏడాది 1.23 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. వీటితో పాటు రైతులు తమ పంట పొలాల్లో చిన్నపాటి చెరువులను తవ్వుకున్నారు. వాటిల్లోనూ ఈ చేప పిల్లలను వదలనున్నారు. జైనథ్ మండలంలోని సాత్నాల, తాంసి మండలంలోని మత్తడి వాగు, బజార్‌హత్నూర్ మండలంలోని దేగామ, బోథ్ మండలంలోని కరత్వాడ ప్రాజెక్టు, తలమడుగు మండలంలోని కజ్జర్ల, భీంపూర్ మండలంలోని అందర్‌బంద్‌లోని జెండాగూడ, ఉట్నూర్ మండలంలోని గోపాల్‌పూర్, జైనథ్ మండలం లక్ష్మీపూర్ రిజర్వాయర్‌లో 80 నుంచి 100 ఎంఎం సైజ్ గల చేపపిల్లలను వదలనున్నారు. వీటిలో కట్ల, రాహు, మృగాల వంటి మూడు రకాలను 40, 50, 10 నిష్పత్తి చొప్పున 90.60 లక్షలు వదలాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇక మత్స్యశాఖకు సంబంధించిన 232 చెరువుల్లో కట్ల, రాహు, బంగారు తీగను 35, 35, 30 నిష్పత్తి చొప్పున 33లక్షల చేప పిల్లలను వదిలేలా ప్రణాళిక సిద్ధం చేశారు. గతేడాది 1.10 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ ఏడాది మరో 13లక్షల పిల్లలను అదనంగా పంపిణీ చేయాలని నిర్ణయించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు నిండితే ఆగస్టు మొదటి వారంలో వీటి పంపిణీని ప్రారంభించేలా మత్స్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### వారంలోగా క్షేత్రస్థాయి పరిశీలన

జిల్లాలోని నీటి వనరుల్లో వదిలేందుకు అవసరమైన చేప పిల్లల సీడ్ సరఫరాకు సంబంధించి రెండు టెండర్లు దాఖలయ్యాయి. వాటిపై క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించాల్సి ఉంది. వారం రోజుల్లోగా పరిశీలన పూర్తి చేసి టెండర్లను ఖరారు చేస్తాం. ఎల్1గా టెండర్ దాఖలు చేసిన వారికి వాటి సరఫరా బాధ్యతలను అప్పగిస్తాం. చెరువులు నిండినట్‌లైతే ఆగస్టు మొదటి వారంలో సీడ్ పంపిణీ ప్రారంభిస్తాం. లేకుంటే సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల్లో మాత్రమే వాటిని వదులుతాం.

– సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

# నచ్చినట్లు.. సర్దుబాటు!

- ఇష్టానుసారంగా ఉపాధ్యాయుల కేటాయింపు
- అవసరం ఉన్నచోటుకు నో.. లేని చోటకు మాత్రం ఓకే!
- ఇన్‌చార్జి ఎంఈవోల తీరుపై విమర్శలు
- ఖాళీ పోస్టులతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం




ఆదిలాబాద్‌టౌన్: విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో పాలన గాడి తప్పింది. డీఈవోతో పాటు జిల్లాలోని మండల విద్యాధికారులంతా ఇన్‌చార్జీలే కావడం గమనార్హం. ఈ ప్రభావం విద్యార్థుల చదువుపై పడుతోంది. రెగ్యులర్ ఉపాధ్యాయ నియామక ప్రక్రియ లేకపోవడంతో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల స్థానంలో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను ఆయా పాఠశాలలకు కేటాయిస్తున్నారు. అయితే ఈ ప్రక్రియ జిల్లాలో గందరగోళంగా తయారైంది. జిల్లా విద్యా శాఖాధికారులు ఈ ప్రక్రియ నిర్వహించాల్సి ఉండగా, సంబంధిత మండలాల ఎంఈవోలకు మండల పరిధిలోనే సర్దుబాటు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలిచ్చారు. దీంతో ఇన్‌చార్జి మండల విద్యాధికారులు ఇష్టారాజ్యంగా కేటాయింపులు చేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తమకు అనుకూలంగా ఉన్నవారికి నచ్చిన చోట పోస్టింగ్ ఇవ్వడం, అలాగే అవసరం ఉన్న చోట కాకుండా అవసరం లేనిచోట కేటాయించడం, జూనియర్లకు బదులు సీనియర్లను ఇతర పాఠశాలలకు సర్దుబాటుచేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఎంఈవోల ఇష్టారాజ్యం..**

సర్దుబాటు ప్రక్రియలో మండల విద్యాధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో డీఈవో పరిధిలో 701 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 547 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో 50 పీజీ హెచ్ ఎంలు, 55 పీఎస్ హెచ్‌ఎంలు, 204 స్కూల్ అసిస్టెంట్లు, 14 లాంగ్వేజ్ పండితులు, 2 పీఈటీ పోస్టులు, 17 ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల్లో విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా అవసరాన్ని మించి ఉన్న ఉపాధ్యాయ పోస్టులను సర్దుబాటు చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా విద్యా శాఖాధికారులు సంబంధిత ఎంఈవోలను ఆదేశించారు. ఇదే అదునుగా పలువురు ఎంఈవోలు సర్దుబాటు ప్రక్రియను తమకు అనుకూలంగా మలుచుకున్నట్లు తెలుస్తోంది. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, కొంతమంది సంఘ బాధ్యులు, జిల్లా విద్యా శాఖాధికారులు చెప్పిన విధంగా వారికి అనుకూలమైన వారికి సర్దుబాటు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది అధికారులకు విందులు, నజరానాలు అందజేయడంతో ఈ ప్రక్రియ సజావుగా సాగలేదనే ప్రచారం సాగుతోంది.

**జిల్లాలో సర్దుబాటు తీరిది..**

జిల్లాలో సర్దుబాటు ప్రక్రియ గందరగోళంగా సాగింది. 50 మందిని ఉన్నత పాఠశాలల్లో, 53 మందిని ప్రాథమిక పాఠశాలల్లో, 19 మందిని ప్రాథమికోన్నత పాఠశాలల్లో కలిపి మొత్తం 122 మందిని సర్దుబాటు చేశారు. అయితే ఇందులో తప్పిదాలు మచ్చుకు కొన్ని..

- ఇచ్చోడ మండలంలోని తలమద్రి ఉన్నత పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయుడితో కలిపి 9 మంది స్కూల్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. అయితే ఈ పాఠశాల నుంచి ఏ ఒక్కరిని కూడా సర్దుబాటు చేయకపోవడం అధికారుల తీరుకు నిదర్శనంగా నిలుస్తోంది.
- తలమడుగు మండలంలో పనిచేస్తున్న ఓ ఎస్జీటీకి జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్‌కు ఇటీవల డిప్యూటేషన్ కల్పించారు. ఇక్కడ నలుగురు ఉపాధ్యాయులు, 90 మంది విద్యార్థులు ఉండడంతో అదనంగా ఉన్నారని పంపించారు. అయితే తాజాగా ఈ పాఠశాలకు ఎస్జీటీని సర్దుబాటు చేయడం విస్మయానికి గురిచేస్తోంది.
- ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్జీవో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. ఇక్కడ అవసరానికి మించి ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ పాఠశాల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయలేదు.
- బోథ్ మండలం పొచ్చెర ప్రాథమిక పాఠశాలలో 65 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ముగ్గురు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, ఇందులో నుంచి ఒక ఉపాధ్యాయురాలిని బోథ్ ఉన్నత పాఠశాలకు సర్దుబాటు చేశారు. ఆమెకు విద్యార్హత లేకున్నా అక్కడ కేటాయించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.
- బోథ్ మండలంలోని కరత్వాడ ప్రాథమిక పాఠశాలలో 33 మంది విద్యార్థులు ఉన్నారు. ఇద్దరు టీచర్లు పనిచేస్తున్నారు. ఇందులో నుంచి బోథ్ ఉన్నత పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడిని కేటాయించారు. మిగిలిన ఉపాధ్యాయుడు సెలవు పెడితే పాఠశాలకు సెలవే అన్నట్లుగా మారింది. నిబంధనల ప్రకారం 19 మంది విద్యార్థులు కంటే ఎక్కువగా ఉంటే అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉంటుంది.
- బోథ్ మండలం కన్గుట్ట పాఠశాలలో 85 మంది విద్యార్థులు ఉన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అయితే ఈ పాఠశాలకు సర్దుబాటులో ఏ ఒక్క ఉపాధ్యాయుడిని కేటాయించకపోవడం గమనార్హం.
- ఆదిలాబాద్ పట్టణంలోని బ్రాహ్మణవాడ యూపీఎస్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు ఉన్నారు. అయితే ఈ పాఠశాలలో ఒకరిని సర్దుబాటు చేయాల్సి ఉండగా, ఇద్దరిని వేరే పాఠశాలకు సర్దుబాటు చేయడంతో ఇక్కడి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి.

### విద్యావ్యవస్థ గాడి తప్పింది



జిల్లాలో ప్రాథమిక విద్యావ్యవస్థ గాడి తప్పింది. ప్రస్తుతం ఆయా మండలాల్లో ఉన్న ఎంఈవోలంతా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులే. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను సర్దుబాటు పేరిట ఉన్నత పాఠశాలలకు కేటాయించడంతో విద్యార్థులకు నష్టం వాటిల్లుతుంది. సర్దుబాటు ప్రక్రియలో లోటుపాట్లను తొలగించి సక్రమంగా చేపట్టాలి.

– గడుగు నరేందర్, ఎస్జీటీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

### వ్యక్తుల ప్రయోజనానికే ప్రాధాన్యత..



ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను జిల్లాలో గందరగోళంగా చేపట్టారు. తమకు అనుకూలమైన వారికి ప్రయోజనం చేకూరే విధంగా కొంతమంది ఎంఈవోలు వ్యవహరించారు. విద్యార్థుల ప్రయోజనాలను విస్మరించారు. ఇచ్చోడ, బోథ్, ఇతర మండలాల్లో ఈ ప్రక్రియ ఇష్టానుసారంగా సాగింది.

– వెంకట్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

### అవసరమైన పాఠశాలలకు కేటాయించాం

సర్దుబాటు ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా చేపట్టాం. అవసరం ఉన్న పాఠశాలలకే ఉపాధ్యాయులను కేటాయించాం. విద్యార్థుల చదువుకు ఇబ్బందులు కలగవద్దనే ఉద్దేశంతో ఈ ప్రక్రియ పూర్తిచేశాం. ఎక్కడైనా అవసరం లేనిచోట కేటాయిస్తే వారిని తిరిగి అవసరమైన చోటుకు మారుస్తాం.

– ప్రణీత, డీఈవో

## క్లుప్తంగా

### రవీంద్రప్రసాద్‌కు ఉత్తమ డాక్టర్ అవార్డు


ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డాక్టర్

**బోథ్:** బోథ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ రవీంద్రప్రసాద్ జిల్లాలో అత్యధికంగా 196 కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసినందుకు ఉత్తమ డాక్టర్‌గా ఎంపికయ్యారు. ఈమేరకు జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కుటుంబ నియంత్రణ చికిత్సలకు బోథ్ సామాజిక ఆరోగ్య కేంద్రం ఆదర్శంగా నిలబడిందన్నారు. ఈ సందర్భంగా రవీంద్రప్రసాద్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

### జాతీయస్థాయి వుషూ పోటీలకు ఎంపిక


పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

**భైంసాటౌన్:** జాతీయస్థాయి వుషూ పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా ఎస్‌ఐఎస్ కోచ్ శ్రీరాముల సాయికృష్ణ తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 9, 10 తేదీల్లో అమెచ్యూర్ వుషూ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్, సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి 14 మంది క్రీడాకారులు పాల్గొనగా జూనియర్స్ (48 కేజీ) విభాగంలో ఆర్ సోనితాయి, (52కేజీ) విభాగంలో ఆర్.స్వాతి, బాలుర విభాగంలో (42 కేజీ) రామ్‌చరణ్, (52 కేజీ) విభాగంలో జె.కిరణ్ బంగారు పతకాలు సాధించారు. (39కేజీ) విభాగంలో కె. భావన, (52 కేజీ) విభాగంలో జి.కమల్ రజత పతకాలు పొందారు. (33 కేజీ) విభాగంలో సీహెచ్ శీతల్, (39కేజీ) విభాగంలో ఆర్.సింధు, (48 కేజీ) విభాగంలో సీహెచ్ స్పందన కాంస్య పతకాలు గెలుపొందారు. బంగారు పతకాలు పొందిన క్రీడాకారులు బీహార్‌లో ఆగస్టు 6 నుంచి 11వ తేదీ వరకు జరిగే 22వ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు నిర్మల్ జిల్లా అధ్యక్షులు నగేష్, చందుల స్వామి అభినందించారు.

### 2న చలో ఢిల్లీ

**కైలాస్‌నగర్:** దివ్యాంగులకు రాజకీయ పరమైన రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఆగస్టు 2వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు కోరారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్, ప్రహ్లాద్, సంతోష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### గుడుంబా పట్టివేత

**ఇచ్చోడ:** రూ.2500 విలువ గల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు స్థానిక సుభాష్‌నగర్ కాలనీలో మంగళవారం ఆకస్మాత్తుగా దాడి చేసి గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# పసిడి సాగు పతనం

- గిట్టుబాటు ధరలు లేక ఆసక్తి చూపని పసుపు రైతులు
- మార్కెట్ సౌకర్యం కరువు


పసుపు విత్తనం


పసుపు పంట సాగు (ఫైల్)

**మామడ:** పసుపు సాగును పసిడితో పోలుస్తారు. పసిడి ధరలు పెరిగితే పసుపు ధరలు పెరుగుతాయని రైతుల నమ్మకం. రైతులు పసుపు పంటతో సాగు చేసే మిగితా పంటలు వరి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి పంటలు సాగు చేసి విక్రయించగా వచ్చిన ఆదాయం సాగుకు పెట్టిన పెట్టుబడులకు సరిపోగా పసుపు పంట విక్రయించగా వచ్చే ఆదాయంతో ఇక్కడి రైతులు ఇల్లు కట్టుకోవడం, పిల్లలకు పెళ్లిళ్లు చేయడం వంటి శుభకార్యాలకు వినియోగిస్తారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ సీఎంగా ఉన్న సమయంలో ఏడాది క్వింటాల్ పసుపు పదిహేను వేలు పలికింది. ఏళ్లుగా పసుపు పంటకు గిట్టుబాటు ధరలు ఉండకపోవడంతో రైతులు పసుపు పంట సాగును క్రమంగా తగ్గిస్తూ ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగుకు మొగ్గు చూపుతున్నారు.

**పసుపు సాగుపై రైతుల విముఖత...**

పసుపు పంటను తొమ్మిది నెలల పాటు చేయాల్సి ఉంటుంది. ఎకరంలో పసుపు పంటను సాగు చేసేందుకు లక్ష రూపాయలకు పైగా వ్యయం అవుతోంది. ఎకరంలో 20క్వింటాళ్ల వరకు పసుపు పంట రైతులకు దిగుబడి వస్తుంది. ఈ ఏడాది పసుపు పంటకు క్వింటాల్‌కు 4 నుంచి 5వేల వరకు మాత్రమే ధర లభించింది. దీంతో పసుపు సాగుచేసిన రైతులకు ఎకరంన్నరకు రూ.80వేలు రావడంతో గిట్టుబాటు కాక నష్టం వాటిల్లింది.

**నిర్మల్ జిల్లాలో పసుపు పంట సాగు వివరాలు**

| సంవత్సరం | పసుపు సాగు ఎకరాల్లో.. |
|---|---|
| 2020 | 16,043 |
| 2021 | 13,671 |
| 2022 | 11,797 |
| 2023 | 10వేల ఎకరాల అంచనా |

**మార్కెట్ లేదు.. గిట్టుబాటు రాదు..**

జిల్లాలో లక్ష్మణచాంద, మామడ, సోన్, నిర్మల్ రూరల్, సారంగపూర్, ఖానాపూర్, దిలావార్‌పూర్, లోకేశ్వరం, కుంటాల, నర్సాపూర్(జి) మండలాలలో పసుపు పంటను రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. జిల్లాలో 4లక్షల 40వేల ఎకరాల్లో మొత్తం పంటలు సాగు చేస్తుండగా గత ఏడాది 11,797 ఎకరాల్లో 11,38 మంది రైతులు పసుపు పంటను సాగు చేశారు. పండించిన పసుపు పంటను విక్రయించేందుకు మార్కెట్ సౌకర్యం లేక నిజామాబాద్, మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌కు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. రైతులకు రవాణా చార్జీల రూపంలో వ్యయం ఎక్కువ. మార్కెట్ సౌకర్యం కల్పించాలని ఇక్కడి ప్రాంత రైతులు డిమాండ్ చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తారని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. కొందరు పూర్తిగా పసుపు పంట సాగును నిలిపి వేయకుండా ధరలు పెరుగుతాయన్న ఆశతో పసుపు పంట సాగును సగానికి తగ్గించారు. పసుపు పంట సాగుకు బదులుగా మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, ఆయిల్ పాం వంటి పంటలను సాగు చేస్తున్నారు.

### మూడేళ్లుగా పంట సాగు తగ్గించాను



నేను ప్రతీ ఏడాది నాలుగు ఎకరాలలో పసుపు పంటను సాగు చేసేవాడిని. మూడు సంవత్సరాలుగా పసుపు పంటకు ధరలు లేక పోవడంతో పసుపు పంట సాగు వ్యయం పెరిగింది. గిట్టుబాటు ధరలు లేక లాభాలు రాకపోగా పసుపు పంట సాగు చేస్తే నష్టం వచ్చింది. పసుపు పంట సాగును నాలుగు ఎకరాల నుంచి ఎకరానికి తగ్గించాను. పసుపు పంటకు బదులుగా ఇతర పంటలను సాగు చేస్తున్నాను.

– మధుసూదన్‌రెడ్డి, సిద్దులకుంట, రైతు

### పంటల సాగులో వ్యయాన్ని తగ్గించుకోవాలి



పంటల సాగులో రైతులు వ్యయం తగ్గించుకోవాలి. పంటల సాగులో పంటమార్పిని పాటించాలి. జిల్లాలో పసుపు, ఆయిల్‌పాం, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, వరి పంటలను సాగు చేస్తున్నారు. పసుపు పంటతో పోలిస్తే ఇతర పంటలు తక్కువ వ్యయంతోనే సాగు చేయవచ్చు. ఇతర పంటలకు ఆశించిన ధరలు ఉంటే మంచి లాభాలు పొందుతారు.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి

# విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలి


మొక్కలు నాటుతున్న ఐటీడీఏ పీవో


విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఐటీడీఏ పీవో

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్
- జామ్డా బాలికల ఆశ్రమ పాఠశాలలో రెండు గంటల పాటు పదో తరగతి విద్యార్థులకు బోధన

**నార్నూర్:** ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని, విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం మండలంలోని జామ్డా బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. డివిజన్ లెవల్ ప్రధానోపాధ్యాయులు, వార్డెన్‌లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో వందశాతం విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మీ పిల్లలపై ఎటువంటి శ్రద్ధ తీసుకుంటారో పాఠశాలలో చదివే విద్యార్థులపై అలాగే శ్రద్ధ తీసుకుని నాణ్యమైన విద్యతో పాటు మంచి భోజనాన్ని అందించాలన్నారు. జామ్డా పాఠశాల సమస్యలను ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పలు ప్రశ్నలు అడిగారు. ఇద్దరు, ముగ్గురు విద్యార్థినులు సరిగా సమాధానం చెప్పకపోవడంతో బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాకాలం విద్యార్థుల ఆరోగ్యంతో పాటు వసతి గృహాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. డీడీ దిలీప్‌కుమార్, ఏటీడీవో క్రాంతికుమార్ ఉన్నారు.

**ప్రతీ విద్యార్థికి ప్రవేశం కల్పించేలా చర్యలు**

**ఉట్నూర్‌రూరల్:** గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ప్రతీ విద్యార్థికి ప్రవేశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఉట్నూర్ మండలం లాల్‌టేకిడి ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించిన కౌన్సెలింగ్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రతీ గిరిజన విద్యార్థికి రెసిడెన్షియల్ కళాశాలలో ప్రవేశం కల్పించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఇప్పటి వరకు 212 మందికి ప్రవేశాలు కల్పించినట్లు తెలిపారు. కళాశాల నుంచి మరో కళాశాలకు కోరుకున్న విద్యార్థులకు బదిలీ చేసినట్లు చెప్పారు. అనంతరం హస్నాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. డాక్టర్ పోస్టు భర్తీకి చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఆర్సీఓ గంగాధర్, ఏసీఎంవో జగన్, ఏటీడీవో క్రాంతి పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి


ముత్తవ్వ (ఫైల్)

**నేరడిగొండ:** మండలంలోని ధార్మిక్‌నగర్ సమీపంలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మహిళ మృతి చెందింది. నిర్మల్ జిల్లా సోన్ మండలం కడ్తాల్ గ్రామానికి చెందిన గొల్లసాయి ముత్తవ్వ తన భర్త గొల్లసాయి లక్ష్మణ్‌తో కలిసి శుభకార్యానికి ఆహ్వానించేందుకు వాంకిడిలోని బంధువుల ఇంటికి ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి వస్తుండగా ధార్మిక్ నగర్ సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోయారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ముత్తవ్వ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# అనర్హులకు 'పోడు' పట్టాలు

- డ్యాంగాపూర్‌లో ముగ్గురికి..
- అటవీ అధికారులకు ఫిర్యాదు


డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

**నిర్మల్‌టౌన్:** అడవినే నమ్ముకున్న ఆదివాసీలకు ఇవ్వాల్సిన పోడుపట్టాలు అనర్హులకూ అందుతున్నాయి. నిర్మల్‌రూరల్ మండలంలోని డ్యాంగాపూర్‌లో మొత్తం ఆరుగురికి పట్టాలు రాగా అందులో ముగ్గురు ఎస్టీలు కాదని తేలింది. ఈమేరకు తుడుం దెబ్బ నాయకులు, గ్రామస్తులు మంగళవారం నిర్మల్‌లో అటవీశాఖ కార్యాలయంలో సదరు ఆధారాలతో డీఎఫ్‌ఓ సునీల్ హిరేమత్‌కు ఫిర్యాదు చేశారు.

**ముగ్గురు ఇతరులే..**

గ్రామంలో పోడు భూములకు సంబంధించి ఇటీవల వ్యక్తిగత అటవీహక్కుల పత్రాలను అందించారు. ఇందులో భాగంగా డ్యాంగాపూర్‌లో ఆరుగురు అర్హులంటూ ఎంపిక చేసిన అధికారులు గుర్తించారు. ఈ ఆరుగురిలో ముగ్గురే ఇందుకు అర్హులని, మిగితా ముగ్గురు ఎస్టీలు కాదని గ్రామస్తులకు తెలిసింది. ఇద్దరు బీసీ–డీ, ఒకరు ఎస్సీ వర్గానికి చెందిన వారికి పట్టాలు ఇచ్చినట్లు ఫిర్యాదుదారులు ఆధారాలు చూపారు. అర్హులైన ఎస్టీలు ఉండగా నిబంధనల ప్రకారం అర్హత లేనివారికి ఎలా ఇస్తారంటూ వారు ప్రశ్నించారు. దీనిపై డీఎఫ్‌ఓ స్పందిస్తూ.. కమిటీ, గ్రామ కార్యదర్శి క్షేత్రస్థాయిలో ఎంపికలు చేశారని, అనర్హులకు ఇవ్వడంపై తమ శాఖ పరంగా కూడా వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. పోడుపట్టాలు అనర్హులకు అందడంపై ఆర్డీవో విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.

# పార్టీపై కుట్రలు చేస్తే సహించేది లేదు

- పార్టీకి నష్టం చేసేవారు పద్ధతి మార్చుకోవాలి
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్


మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భొజ్జు

**ఉట్నూర్‌రూరల్:** ఖానాపూర్ నియోజకవర్గంలో కొంత మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు తెర వెనుక కుట్రలు చేస్తూ పార్టీకి నష్టం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తప్పవని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్న స్థానిక నేతల తీరుపై ఆయన మండిపడ్డారు. నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంపీటీసీ భరత్‌చౌహాన్, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్‌లు గతంలో ఉన్న వారి పార్టీ పదవులకు రాజీనామా చేశారన్నారు. కార్యకర్తలను తప్పుదోవ పట్టించడానికి ఒకరు రాష్ట్ర ఆదివాసీ విభాగం ఉపాధ్యక్షుడిగా, మరొకరు జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ప్రచారం చేసుకుంటూ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారన్నారు. ఈ నెల నాలుగో తేదీన విడుదలైన మండల అధ్యక్షుల నియామకాల జాబితాలో కొన్ని పొరపాట్లు దొర్లాయని గుర్తించిన అదిష్టానం దాన్ని సవరిస్తూ ఐదో తేదీన తాజా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కొంత మంది నాయకులు గ్రూప్‌గా ఏర్పడి నియోజకవర్గంలో కార్యకర్తల మధ్య గందరగోళం సృష్టిస్తున్నారని తెలిపారు. భారత్‌చౌహాన్, చారులతపై అదిష్టానానికి ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యూం, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బిరుదుల లాజర్, మాజీ మండల అధ్యక్షుడు దూట రాజేశ్వర్, మాజీ సర్పంచ్‌లు, భీమన్న, మాణిక్‌రావు, మైనార్టీ మండల అధ్యక్షుడు షేక్ సలీం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అచ్చ దేవానందం, మైనార్టీ చౌస్ అధ్యక్షుడు ఇమ్రాన్, రాజగౌడ్, అహ్మద్, రాహుల్, పైకు, అబ్దుల్ మాజీద్, నగేశ్, సుధాకర్ ఉన్నారు.

# ప్రమాదానికి కారణమైన లారీ పట్టివేత

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగేందర్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేందర్

**గుడిహత్నూర్:** మండలంలోని జాతీయ రహదారి 44పై మేకలగండి వద్ద గత 8వ తేదీ తెల్లవారు జామున జరిగిన ఆటో ప్రమాదంలో జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు డీఎస్పీ నాగేందర్ ఇచ్చోడ పోలీస్‌స్టేషనులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే లారీని డ్రైవర్ చాట్ల రజనీకాంత్ 8వ తేదీ ఉదయం 4గంటలకు అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ముందు వెళ్తున్న ఆటోను ఢీ కొట్టి వెళ్లిపోయాడు. లారీని చంద్రపూర్ తీసుకెళ్లి గ్యారేజీలో లారీ బంపరు, ఇతర భాగాలను కొత్తగా అమర్చాడు. ఎప్పటిలాగే విధులు నిర్వహిస్తున్నాడు. పోలీసులు మాత్రం ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకోవడానికి అన్ని విధాల ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో రహదారిపై వివిధ చోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగా పట్టుకుని డ్రైవర్ రజనీకాంత్‌ను విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

### మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య


సచిన్ (ఫైల్)

**జైనథ్:** బేల మండలం చప్రాల గ్రామానికి చెందిన నకాతే సచిన్ (25) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు తెలిపారు. వారి కథనం ప్రకారం... సచిన్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో తాగుడు మానాలని తల్లిదండ్రులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ మానుకోలేదు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కుటుంబీకులు మందలించగా మనస్తాపానికి గురై ఇంటి నుంచి మ్యాక్స్ పికప్ వాహనంలో ఆదిలాబాద్ వైపు వెళ్లాడు. మార్గమధ్యలో జైనథ్ మండలం దీపాయిగూడ ఎక్స్‌రోడ్ సమీపంలో వాహనంలోనే పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించి రిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. తండ్రి నకాతే వినాయక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సరిహద్దు ప్రాంతాలపై నిఘా పెంచాలి


మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

- ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

**తాంసి:** భీంపూర్ మండలం మహారాష్ట్ర సరిహద్దున ఉన్నందున అంతర్రాష్ట్ర రహదారిలో అక్రమ రవాణా జరుగకుండా నిఘా పెంచాలని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం భీంపూర్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్, సరిహద్దు గ్రామాలను ఎస్సై రాధికతో కలిసి తనిఖీ చేశారు. మొదట పోలీస్‌స్టేషన్ సందర్శించి స్టేషన్‌లో పరిసరాలను రికార్డులను పరిశీలించి ఎస్సైకి పలు సూచనలు చేశారు. సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై ఆరాతీశారు. అనంతరం మండలంలోని కరంజి అర్లి(టి) సరిహద్దు గ్రామాలను సందర్శించారు. పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. ప్రభుత్వం చదువు కోసం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్లి(టి) గ్రామంలోని విత్తన దుకాణాన్ని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే దొంగతనాలు అరికట్టే అవకాశం ఉన్నందునా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. వారి వెంట భీంపూర్ ఎస్సై రాధిక, సిబ్బంది ఉన్నారు.

## కార్యాలయాలకు వెళ్లేదెలా..?


మున్సిపల్ కార్యాలయం ఎదుట గుంతలు


మున్సిపల్ కార్యాలయం ఎదుట..


మున్సిపల్ కార్యాలయం వద్ద బురద..


జెడ్పీ కార్యాలయ ఆవరణలో...

నిర్మల్ జిల్లా కేంద్రంలోని పలు కార్యాలయ ఆవరణలో చినుకుపడితే బురదమయంగా మారి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిర్మల్ మున్సిపల్ కార్యాలయం ఆవరణ బురదమయంగా మారడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాల్ కార్యాలయం ఇలా ఉంటే పట్టణం ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జెడ్పీ కార్యాలయం చుట్టు పక్కల ఉన్న ఎంపీపీ, ఐకేపీ కార్యాలయాలకు వెళ్లాలంటే బురద దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - సాక్షి, ఫొటోగ్రాఫర్ నిర్మల్